## జ్యోతిష్మతిలో ఉత్సాహంగా ఉత్సవ్-25


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ జువ్వాడి సాగర్ రావు

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్19: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి అటానమస్ కళాశాల వార్షికోత్సవం శనివారం ఉత్సవ్ -2025 పేరిట ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జేఎన్‌టీయూ హైదరాబాద్, రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ డైరెక్టర్ కామాక్షిప్రసాద్ హాజరుకాగా, వారితో కలిసి కళాశాల చైర్మన్ సాగర్ రావు జ్యోతి ప్రజ్వల చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యార్థులు చదవుతో పాటు సాంకేతిక నైపుణ్యాన్నిపెంపొందించు కోవాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ సుమిత్ సాయి, ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, అకాడమిక్ డీన్ వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## టెట్ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రసన్న హరికృష్ణ, బృందం సభ్యులు

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19 : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్‌ను దృష్టిలో ఉంచుకుని విన్నర్స్ యాప్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తామని, దీన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రొఫెసర్ డాక్టర్ ప్రసన్న హరికృష్ణ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణలో టెట్ కోసం స్టేట్ ఫేమ్ ఫ్యాకల్టీతో రూపొందించిన ఆన్‌లైన్ క్లాసెస్‌కు సంబంధించిన విన్నర్స్ యాప్‌ను అభ్యర్థుల కోసం ప్రారంభించారు. అలాగే, యువత, నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రజా క్షేత్రంలో ఉంటానని ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిల్చున్నప్పుడే మాట ఇచ్చానని, దానికి అనుగుణంగా పని చేస్తానని స్పష్టం చేశారు. గ్రూప్ 1 పరీక్షల్లో తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం జరిగిందని, అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వస్తున్న క్రమంలో వాటిపై విచారణ జరుపాలన్నారు. హైదరాబాద్ యూనివర్సిటీ భూముల్లో ఆక్రమణలు జరుగకుండా తాను సైతం ముందుండి పోరాడానని చెప్పారు. అనంతరం ఆన్‌లైన్ ఉచిత శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## జేఈఈ అడ్వాన్స్డ్‌లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న జోనల్ ఇన్‌చార్జి తిరుపతి

తిమ్మాపూర్, ఏప్రిల్19: జేఈఈ అడ్వాన్స్డ్ పరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చూపారు. కరీంనగర్ జిల్లాలోని ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన 185 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో అర్హత సాధించి జాతీయస్థాయిలో సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ చూపిన భరణి శంకర్, సురేశ్, కార్తీక్, మాధవ్ చరణ్, రామ్ చరణ్, నాగపురి రోహిత, పొన్నాల లహరి, కొల్లూరి హాసిని, రిషిశ్వర్ రెడ్డి, సాయి చందన, శ్రీ చరణ్ జోషి, గోవిందారపు శివ సాయిని తిమ్మాపూర్ మండలం అలుగునూర్‌లోని ఎస్ఆర్ కాలేజీలో జోనల్ ఇన్‌చార్జి తిరుపతి అభినందించారు. జాతీయస్థాయిలో తమ విద్యార్థులు అర్హత సాధించడంపై ఆనందం వ్యక్తం చేశారు. విజయం సాధించడంలో తమ యాజమాన్యం అందించిన ప్రోత్సాహాన్ని గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. అధ్యాపకులు అందించిన కృషితోనే తాము అర్హత సాధించినట్లు విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

## లివర్ పాడవడానికి మద్యం ఒక్కటే కారణం కాదు?

- వరల్డ్ లివర్ డే సందర్భంగా హెల్త్‌టాక్‌లో మెడికవర్ వైద్యులు



మాట్లాడుతున్న మెడికవర్ వైద్యులు

విద్యానగర్, ఏప్రిల్ 19: లివర్ పాడవడానికి మద్యమే కారణమనే అపోహ ప్రజల్లో ఉందని, మద్యంతో పాటు అధిక బరువు ఉండడం, ఇన్ ఫెక్షన్లు కూడా కారణమవుతాయని మెడికవర్ వైద్యులు తెలిపారు. వరల్డ్ లివర్ డే సందర్భంగా కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సర్కస్ గ్రౌండ్‌లో వాకర్స్‌కు హెల్త్ టాక్, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. లివర్ పనితీరును బట్టే శరీరంలోని జీవక్రియలు, జీర్ణక్రియ సక్రమంగా పనిచేస్తాయన్నారు. మద్యం సేవించే వారు అల్ట్రాసౌండ్ చేసుకొని ఫ్యాటీ లివర్ ఉంటే డాక్టర్‌ను సంప్రదించి సరైన వైద్యం తీసుకుంటే ఎక్కువ రోజులు లివర్‌ను ఆరోగ్యంగా కాపాడుకోవచ్చన్నారు. మెడికవర్‌లో అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ దిలీప్ రెడ్డి, మెడికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ ప్రణీత్, అనెస్థీషియా వైద్యులు డాక్టర్ వినయ్ కుమార్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ లోకేష్ బీరకాయల, సూపరింటెండెంట్ డాక్టర్ రవిమల్లారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ కర్ణాకర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయిచరణ్, హెచ్ఆర్ హెడ్ ఈశ్వర్, వాకర్స్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ ప్రగతి హైస్కూల్‌లో ఘనంగా 'యుఫోరియా'


గోపాల్‌రావుపేట శ్రీప్రగతి హైస్కూల్ వార్షికోత్సవంలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం

రామడుగు, ఏప్రిల్ 19 : మండలంలోని గోపాల్‌రావుపేట శ్రీ ప్రగతి హైస్కూల్లో శనివారం పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా యుఫోరియా(ఆనందం) కార్యక్రమాన్ని చిన్నారులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయసాధనకోసం కృషి చేయాలని సూచించారు. చదువు నేర్పే గురువులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అన్నదానం రాధాకృష్ణతో పాటు డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కార్యాలయం ఎదుట సామాజిక కార్యకర్త బైఠాయింపు

జమ్మికుంట, ఏప్రిల్19: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని విచ్చలవిడిగా అమ్ముతున్న 'మత్తు' పదార్థాలను కట్టడి చేయాలని ఫిర్యాదు చేసేందుకు సామాజిక కార్యకర్త శ్రీకాంత్ శనివారం పట్టణంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి వెళ్లగా, అధికారులెవరూ విధుల్లో లేకపోవడంతో కార్యాలయం ఎదుట బైఠాయించి తన నిరసన తెలిపారు. అందుకు సంబంధించిన వీడియోను ఆయన రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం విధులకు హాజరుకావల్సిన సీఐ, ఎస్ఐలు ఎవరూ కార్యాలయానికి రాలేదని, అంతేకాకుండా ఫిర్యాదు అందించేందుకు వస్తే తప్పుడు సమాధానాలిచ్చారని తెలిపారు. రికార్డులను పరిశీలించాలని ఉన్నతాధికారులను కోరారు. సర్కిల్ పరిధిలో మత్తు పదార్థాలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

# అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలి

- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి


వీణవంకలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, ఏప్రిల్ 19: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల పంటలకు బోనస్ ఇవ్వాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులను ఎట్టి పరిస్థితిలో ఇబ్బందులు పెట్టొద్దని, బార్దాన్ కూడా సరిపడా అందుబాటులో ఉంచాలన్నారు. వాతావరణం బాగాలేనందున వీలైనంత త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీధర్, మాజీ ఎంపీపీ రేణుక-తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు మధుసూదన్‌రెడ్డి, గెల్లు మల్లయ్య, గూటం సమ్మిరెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు మాదాసి సునీల్, శ్రీపతిరెడ్డి, ఏపీఎం కొమురయ్య, ఏవో గణేశ్, సీసీలు ఆనంద్, ఘనశ్యాం, తిరుపతి, శ్రీకాంత్, పద్మ, మాజీ ఉపసర్పంచ్ భానుచందర్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

### స్వచ్ఛ హుజూరాబాద్‌గా మార్చాలి

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 19: హుజూరాబాద్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ పట్టణంగా మార్చాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సూచించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో హుజూరాబాద్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులో భాగంగా పట్టణంలోని వివిధ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన స్వచ్ఛ సైన్స్ ఎగ్జిబిషన్, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను తిలకించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, డీఈవో జనార్ధన్ రావు, వరంగల్ రీజనల్ డైరెక్టర్ షాహిద్ మసూద్, ఎంఈవో భూపతి శ్రీనివాస్, హుజూరాబాద్ ఎంవీఐ వేణు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ఎడవల్లి కొండల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్థలకు ప్రాంతేతరుల పేర్లా?

ప్రభుత్వ నిర్ణయాన్ని అడ్డుకుంటాం • తెలంగాణ వికాస సమితి స్పష్టం


మాట్లాడుతున్న ప్రొ.సీతారామారావు

కలెక్టరేట్, ఏప్రిల్ 19 : తెలంగాణలోని సంస్థలకు ప్రాంతేతరుల పేర్లు పెట్టి, తెలంగాణ ప్రజల ఆత్మాభిమానం మరోసారి తాకట్టు పెట్టేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని, దీనిని తెలంగాణ వికాస సమితి తీవ్రంగా ఖండిస్తోందని ఆసంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎర్రోజు శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రగతి గతం-వర్తమానం-భవిష్యత్తు అంశంపై శనివారం నగరంలోని కృషి భవన్‌లో తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు పొట్టి శ్రీరాములు పేరు, రింగ్ రోడ్డులో ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు చేసి, ఎన్‌టీఆర్ జంక్షన్‌గా ప్రకటిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించడం సముచితం కాదన్నారు. తాము ఏప్రాంతానికి, ఏ సామాజిక వర్గానికి వ్యతిరేకం కాదని.. అయితే, తెలంగాణ అస్థిత్వ పోరాటాన్ని, ఆకాంక్షలను దెబ్బతీస్తే ఊరుకోబోమన్నారు. తెలంగాణ వస్తే ఏమొచ్చింది? అని నాడు ప్రశ్నించిన వారంతా దశాబ్దకాలంలో మారిన ప్రజల జీవన ప్రమాణాలు, అభివృద్ధి చెందిన వ్యవసాయ రంగం, మారిన రైతుల స్థితిగతులు, కార్మికులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారంతో నేడు నోరెత్తని పరిస్థితిలో ఉన్నారన్నారు. అంతకుముందు అంబేద్కర్ వర్సిటీ మాజీ ఉపకులపతి ప్రొ.సీతారాంరావు, ఆర్థిక నిపుణుడు, విశ్లేషకుడు డి.పాపారావు, తెలంగాణ వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.విజయానంద్, వికాస సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్.రవీందర్, సీనియర్ జర్నలిస్టు పి.వేణుగోపాలస్వామి వివిధ అంశాలపై మాట్లాడారు. శాతవాహన వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కృష్ణకుమార్ మాట్లాడుతూ, తెలంగాణకు ముందు పేదలకు విద్య అందని ద్రాక్షగా ఉండేదని, స్వరాష్ట్రంలో సరస్వతీ ఇంటింటికీ వెళ్లి పేదల తలుపుతట్టిందన్నారు. ఇందుకు నిదర్శనమే జిల్లాకో వైద్య కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయడమన్నారు. రైతుబంధు ద్వారా ప్రతి గ్రామం, ప్రతి రైతు ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు ఆసరి రాజు, పి.క్రాంతి కుమార్, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు, గుంజపడుగు హరిప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, యువజన సంఘాల నేత సత్తినేని శ్రీనివాస్, సాయికృష్ణ, అంజి, వేణుయాదవ్‌తో పాటు పలు రంగాలకు చెందిన మేధావులు, విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన ఎస్ఈ

కార్పొరేషన్, ఏప్రిల్ 19: కరీంనగర్ నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎస్ఈగా శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే ఇంజినీరింగ్ విభాగంలో టెక్నికల్ ఆఫీసర్‌గా డిప్యుటేషన్‌పై సిరిసిల్ల పబ్లిక్ హెల్త్‌లో పనిచేస్తున్న వినయ్ కుమార్ రానున్నట్లు తెలిసింది.

## రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

హుజూరాబాద్ రూరల్, ఏప్రిల్ 19: ఈ నెల 27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ ఇరుమల్ల రాణి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సభకు అధిక సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పేర్కొన్నారు.

## సీపీఐ నగర కార్యదర్శిగా సురేందర్‌రెడ్డి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 19: సీపీఐ నగర కార్యదర్శిగా కసిరెడ్డి సురేందర్‌రెడ్డి ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయ కార్యదర్శులుగా పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజు, కోశాధికారిగా బీర్ల పద్మతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులు, 29 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, నగరంలో పార్టీ కమిటీలు నియమించి, ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

గంగాధర, ఏప్రిల్ 19: హిమ్మత్‌నగర్ గ్రామ శివారులో పేకాడుతున్న నలుగురిని పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.9600 నగదు, పేకముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

# మానేరు రివర్ ఫ్రంట్ పనులను అడ్డుకునేందుకు కుట్ర

బీజేపీ, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాలి • బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కార్పొరేషన్, ఏప్రిల్ 19: కరీంనగర్‌లో చేపడుతున్న మానేరు రివర్ ఫ్రంట్ పనులను ఆపేందుకు బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు పన్నుతున్నాయని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కరీంనగర్‌కు పర్యాటక శోభ తీసుకురావాలన్న ఆలోచనతో గొప్ప ప్రాజెక్టును తీసుకువస్తే అక్రమాలు చోటుచేసుకున్నాయంటూ తప్పుడు ప్రచారాలతో ఈ పనులను అడ్డుకునే ప్రయత్నాలు చేపడుతున్నాయని మండిపడ్డారు. శనివారం స్థానిక 37వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు పనులు సాఫీగా సాగాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేసి పనులు నిలిపివేశారన్నారు. ఈ ప్రాజెక్టు పనులపై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అసెంబ్లీలో ప్రశ్నించారని, పనులు నిలిపివేయడం వల్ల కాంగ్రెస్‌కు చెడ్డ పేరు వస్తుందన్న భయంతోనే ఇటీవలే మళ్లీ పనులు మొదలుపెట్టారని పేర్కొన్నారు. కాగా ఇప్పుడు పనులను అడ్డుకునేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని దుయ్యబట్టారు. కరీంనగర్ మాజీ మేయర్ సునీల్‌రావు కమీషన్ కోసం మానేరు రివర్ ఫ్రంట్ కాంట్రాక్టర్‌ను బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మానేరు రివర్ ఫ్రంట్‌లో అవినీతి జరిగిందంటున్న సునీల్‌రావుకు మేయర్‌గా ఉన్నప్పుడు అవినీతి కనిపించలేదా అని ప్రశ్నించారు. సునీల్‌రావుకు కరీంనగర్ అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే కేంద్రం నుంచి రూ.200 కోట్లు తీసుకురావాలని సూచించారు. మానేరును ఆనుకొని ఉన్న డంప్ యార్డును తొలగించేందుకు కృషి చేయాలన్నారు. మానేరు రివర్ ఫ్రంట్‌ను పూర్తి చేసేందుకు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, నాయకులు చందు, వాజిద్, బొంకూరి మోహన్, ఆరె రవిగౌడ్, చేతి చంద్రశేఖర్, రాజ్ కుమార్, నారదాసు వసంతరావు, వొడ్నాల రాజు, సత్తినేని శ్రీనివాస్, జశ్వంత్, పవన్, చుక్క శ్రీనివాస్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఒలింపియాడ్‌లో పారమిత విద్యార్థుల ప్రతిభ

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19 : ఇటీవల ఇండియన్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్, విజయవాడ ఆధ్వర్యంలో వివిధ సబ్జెక్టులకు నిర్వహించిన ఒలింపియాడ్ పోటీల్లో పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపి, జాతీయ స్థాయిలో ఎనిమిది మంది విద్యార్థులు టాప్ ఐదు స్థానాల్లో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. టి. విరాట్, ఎ. ఆశ్రిత్, తిలక్ ఇనాని, వెల్ది హర్షిణి, సిరి రెడ్డి, ఆశ్రిత్, జె సాయి, రిషిత్ ఉత్తమ ర్యాంకులతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు సాధించారని పేర్కొన్నారు. వీరితోపాటు 23 మంది విద్యార్థులు గణితం, ఆప్టిట్యూడ్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపి జాతీయస్థాయిలో మెరిట్ సర్టిఫికెట్స్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద రావు ప్రత్యేకంగా అభినందించారు.

## బీపీఈడీ ఫలితాలు విడుదల

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19 : శాతవాహన యూనివర్సిటీ పరిధిలో బీపీఈడీ ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరిలో నిర్వహించిన బీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ ఫలితాలు www.satavahana.ac.in లో http://103.119.113.107:84 అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

## 'వారధి' కథాసంపుటి ఆవిష్కరణ

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19: జాతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక భగవతి విద్యానికేతన్‌లో ప్రముఖ కథా రచయిత కటుకోజ్వల మనోహరాచారి రచించిన వారధి కథాసంపుటి ఆవిష్కరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, గ్రంథ స్వీకర్తగా మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయాల జాయింట్ సెక్రటరీ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ హాజరై మాట్లాడారు. సమాజంలోని రుగ్మతలను తొలగించి మనిషిని మార్చగల శక్తి కథకు ఉందన్నారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డా.గండ్ర లక్ష్మణ రావు వారధి పుస్తకాన్ని ఆవిష్కరించగా, ప్రముఖ కథా రచయిత బెజ్జారపు వినోద్ కుమార్, భగవతి విద్యాసంస్థల అధినేత బి రమణారావు, బలగం సినిమా నటుడు ఏలేశ్వరం సత్యం మాట్లాడారు. సాహితీవేత్తలు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం

విద్యానగర్, ఏప్రిల్ 19: లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ గోల్డెన్ శాతవాహన క్లబ్ అధ్యక్షుడు లయన్ మానువాడ శంకర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజియన్ చైర్ పర్సన్ లయన్ గాలిపెల్లి వెంకట్ హాజరయ్యారు. 2025-2026 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లయన్ ననువాల గిరిధర్ రావు, కార్యదర్శిగా లయన్ పాశం నర్సింహారెడ్డి, కోశాధికారిగా లయన్ మానువాడ శంకర్, ఎల్‌సీఐఎఫ్ కోర్డినేటర్‌గా లయన్ అక్కినపల్లి అజయ్ కుమార్, ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్‌గా లయన్ డాక్టర్ కుంబోజు రమేశ్, సెకండ్ వైస్ ప్రెసిడెంట్‌గా చిలుపూరి రాములు, థర్డ్ వైస్ ప్రెసిడెంట్‌గా లయన్ గోనె చంద్రారెడ్డి, క్లబ్ కోఆర్డినేటర్‌గా లయన్ మమతా వేణు, సర్వీస్ కో ఆర్డినేటర్‌గా లయన్ బండారి గంగాధర్, మార్కెటింగ్ కో ఆర్డినేటర్‌గా లయన్ పురుషోత్తం సతీశ్, డైరెక్టర్లుగా లయన్ తొవిటి సంతోష్, లయన్ పృథ్వీరాజ్, లయన్ బడి మురళి, లేడీ లయన్ మానువాడ వనజ ఎన్నికయ్యారు.

## అందరూ ఉండి.. అనాథలుగా మారి

- నిరాదరణకు గురైన తల్లిదండ్రులు
- అనారోగ్యంతో ప్రభుత్వ దవాఖానలో చేరిన వైనం


దవాఖానలో వృద్ధ దంపతులు

విద్యానగర్, ఏప్రిల్ 19: అందరూ ఉన్నా ఆ వృద్ధ దంపతులు అనాథలుగా మారారు. రోగమొస్తే పట్టించుకునే వారు లేక కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాలు వారి కథనం ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం వల్లంపహాడ్‌కు చెందిన నారాయణ, అండమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు. అందరికీ పెళ్లిళ్లు అయి ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. కానీ తల్లిదండ్రుల గురించి ఆలోచించే వారే కరువయ్యారు. దీంతో వృద్ధాప్యంలో తిండికి తిప్పలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో గతంలో అమ్మిన భూమికి సంబంధించి తమకు రావాల్సిన డబ్బులు ఇవ్వమని తన కుమారుడిని అడిగితే తల్లిదండ్రులు వృద్ధులని కూడా చూడకుండా దాడి చేసి కొట్టాడని ఆవేదన వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా నారాయణకు అనారోగ్య సమస్యలు ఎక్కువై బీపీ పెరుగడంతో పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు చెప్పినట్లు తెలిపారు. దీంతో శుక్రవారం ప్రభుత్వ దవాఖానలో చికిత్స కోసం చేరారు. కడుపున పుట్టిన వాళ్లు కాదనడంతో దవాఖాన ఆవరణలో జరిగే అన్నదానంతో కడుపు నింపుకొంటున్నామని ఆ వృద్ధ దంపతులు కన్నీటి పర్యంతమయ్యారు. నలుగురు సంతానం ఉన్నా తమను పట్టించుకునే వారు లేరని, తమకు న్యాయం చేయాలని కనబడిన ప్రతి ఒక్కరినీ కోరుతున్నారు.

## అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 19: ప్రభుత్వం అన్ని రంగాల్లో మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నదని, ఆ క్రమంలోనే వ్యవసాయ రంగానికి సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులోనూ మహిళా సంఘాలకు పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని అల్గునూరు, మహాత్మానగర్, రామకృష్ణ కాలనీ, తిమ్మాపూర్, ఇందిరానగర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళలను కోటీశ్వరులను చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశయం మేరకు మహిళా సంఘాలకు 50 శాతం మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేశ్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపు మల్లారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

చిగురుమామిడి, ఏప్రిల్ 19: నిత్యం ప్రజల మధ్య ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు, పోరాటాలు చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకటరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని రేకొండ, ఓగులాపూర్, రామంచ, ముదిమాణిక్యం, సుందరగిరి, ముల్కనూర్ గ్రామాల్లో సీపీఐ గ్రామ శాఖల మహాసభలకు ముఖ్య అతిథిగా చాడ వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభల్లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, మాజీ జడ్పీటీసీ అందె స్వామి, బోయిని అశోక్, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మీరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం

తెలంగాణచౌక్, ఏప్రిల్19: కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా లింగంపల్లి నాగరాజు ఇటీవల ఎన్నికకాగా, శనివారం కోర్టులోని అసోసియేషన్ కార్యాలయంలో తెలంగాణ రజక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల సంపత్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. నాగరాజు రజక సంఘానికి సలహాదారుగా అందిస్తున్న సేవలను కొనియాడారు. ఇక్కడ నాయకులు కుమార్, ఎల్లయ్య, చంద్రయ్య ఉన్నారు.

## ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలకు స్పందన

కొత్తపల్లి, ఏప్రిల్ 19 : ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కొత్తపల్లిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ మైదానంలో నిర్వహించిన సీనియర్స్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 250 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. పాఠశాల చైర్మన్ యాదగిరి సుజిత్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఇందులో సెలెక్ట్ అయినా క్రీడాకారులు ఈ నెల 29 నుంచి 30 వరకు ఆదిలాబాద్ జిల్లా మందమర్రిలో జరిగే 54వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు.

## కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

గన్నేరువరం, ఏప్రిల్ 19: గునుకుల కొండాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని చొక్కాలపల్లిలో వడ్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని తహసీల్దార్ నరేందర్‌కు రైతులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గునుకుల కొండాపూర్ కేంద్రంలో వరి ధాన్యం పోసేందుకు స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీశైలం, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతితో రైతులకు పూర్తి భరోసా

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 19: ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూములపై పూర్తి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తెలంగాణ భూభారతి చట్టం (భూమి హక్కుల రికార్డు చట్టం)-2025పై శనివారం పట్టణంలోని సిటీ సెంటర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా భూ భారతి చట్టం గురించి వివరించారు. హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్ బాబు భూభారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, తహసీల్దార్ కనకయ్య, రెవెన్యూ, వ్యవసాయ, పంచాయతీ అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

## మానకొండూర్ సీఐగా సంజీవ్


సీఐ సంజీవ్

మానకొండూర్, ఏప్రిల్ 19: మానకొండూర్ సీఐగా బీ సంజీవ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన సీఎస్‌బీ వరంగల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన సీఐ సంజీవ్‌కు పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పొన్నం అనిల్ గౌడ్‌కు పరామర్శ

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 19: మన్నెంపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ అమ్మమ్మ బాలవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, శనివారం ఆయనతోపాటు కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ పరామర్శించారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ బేతి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

## భార్య కండ్లెదుటే కాలువలో దూకి..

- అనారోగ్యంతో బాధపడుతూ యువకుడి ఆత్మహత్య


సాగర్ (ఫైల్)

రామడుగు, ఏప్రిల్19: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువకుడు భార్య కండ్లెదుటే కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో జరిగింది. ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన పురాణం సాగర్(30)కు గంగాధర మండలానికి చెందిన పద్మతో తొమ్మిదేండ్ల క్రితం వివాహం జరిగింది. కూలి పనులు చేసుకొని జీవించే ఈ దంపతులకు రేవంత్(7), మహేశ్(5) ఇద్దరు కొడుకులు. సాగర్ మద్యానికి బానిస కావడంతో కాలేయం దెబ్బతిన్నది. పలు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో గతేడాది శస్త్ర చికిత్స జరిగింది. సాగర్ తిరిగి మళ్లీ మద్యం సేవిస్తుండడంతో ఈసారి పూర్తిగా ఆరోగ్యం క్షీణించింది. ఆసుపత్రికి వెళ్లే స్థోమత లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 18న సాయంత్రం ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయాడు. భర్త ఆచూకీ కోసం వెతుకుతూ వెళ్లిన భార్య పద్మకు చిప్పకుర్తి శివారులోని గ్రావిటీ కెనాల్ వద్ద కనిపించాడు. ఇంటికి వెళదామని వేడుకున్నా భార్య కండ్లెదుటే కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కాలువలో నీరు అధికంగా ఉండడంతో పాటు రాత్రి కావడంతో ఎవరూ కాపాడలేకపోయారు. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. శనివారం ఉదయం సాగర్ మృతదేహాన్ని కాలువలోంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాజు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

BRS T-SHIRTS
★ వరంగల్ దగ్గర ఎల్కతుర్తిలో జరిగే BRS సభకు మీ నాయకుడి & మీ ఫోటోతో ఉన్న T-SHIRTS మీరు కోరిన విధంగా ప్రింట్ చేసి ఇస్తాము. 7416385350.
NT-325302-AII

CHANGE OF NAME
★ Chawdarapu Rajendar, S/o. Mallaiah (Old Name) H.No. 4-18, Padira, Yellareddypet Mandal, Rajanna Sircilla Dist. my Name was changed to Chowdarapu Rajendher (New Name)
NTK-330217

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189